క్లుప్తంగా

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అద్దంకి: చైతన్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా అద్దంకి పట్టణంలో బధిరుల ఆశ్రమ పాఠశాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 2024–25 సంవత్సరానికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశం కోసం పాఠశాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం శుక్రవారం తెలిపారు. 4–16 ఏళ్లలోపు బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, మాటలురాని పిల్లలు ప్రవేశానికి అర్హులు అని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి చెందినవారైనా ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ప్రవేశం పొందినవారికి ఉచిత విద్య, ఉచిత హాస్టల్ సదుపాయాలతోపాటు, వృత్తి విద్య, కంప్యూటర్స్‌లో కూడా శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం అద్దంకిలోని బధిరుల ఆశ్రమ పాఠశాల నందు కానీ, 92900 83319, 89789 23919, 96766 99034 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

కోడిగుడ్ల లోడు లారీ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తాపడిన కోడిగుడ్ల లారీ

మేదరమెట్ల: కోడిగుడ్ల లోడుతో విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ డివైడర్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలను ఢీకొని బోల్తా పడిన ఘటన పీ.గుడిపాడు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో ఎన్‌హెచ్–16 సిబ్బంది లారీని పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. లారీ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

వైభవంగా వినాయకుడి వార్షికోత్సవం



అలంకరణలో వరసిద్ధి వినాయకుడు

బల్లికురవ: ఏ శుభకార్యక్రమం చేపట్టాలన్నా ముందుగా గణనాథుడిని ఆరాధిస్తే అంతా శుభాలే జరుగుతాయని అర్చకులు ఇంకొల్లు మధుబాబుశర్మ అన్నారు. గురువారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ కూడలిలోని వరసిద్ధి వినాయకుని ఆలయ 14వ వార్షిక వేడుకలు వైభవంగా ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, భక్తులకు గోత్రనామాలతో అర్చన చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ వేడుకల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టిప్పర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై టిప్పర్ ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరులో గురువారం ఉదయం జరిగింది. మార్టూరు 108 సిబ్బంది వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన షేక్ యాస్మిన్ స్థానిక సుధా వే బ్రిడ్జి సమీపంలో తన బైకును రిపేర్ చేయించుకుని గుంటూరు వెళ్లడం కోసం సర్వీస్ రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలో మార్టూరు నుంచి రాజుపాలెం వైపు వెళ్తున్న టిప్పర్ వాహనం యాసిన్ బైక్‌ను ఢీకొట్టడంతో టిప్పర్ ముందు టైర్ల కింద పడిన యాసిన్‌కు కుడికాలు విరిగి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది యాసిన్‌ను మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఈవీఎంలు గోదాములకు తరలింపు

చీరాల టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలు, డిఫెక్ట్ ఈవీఎంలు, ట్రైనింగ్ ఈవీఎంలను గోడౌన్లలో భద్రపరుస్తున్నట్లు చీరాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీ సూర్యనారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వేటపాలెం మండలం నాయనపల్లిలో గల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తహశీల్దార్ ఆఫీస్ చీరాల, మున్సిపల్ బాయ్స్ స్కూల్ బాపట్లలో గల స్ట్రాంగ్ రూములను తెరిచి అందులో ఇప్పటి వరకు భద్రపరిచిన ఈవీఎంలను బాపట్లలోని జిల్లా ఈవీఎం గోదాముకు తీసుకుని వెళ్తామన్నారు. అక్కడ భద్రపరిచి సీల్ వేయుటకుగాను మీరందరూ అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు హాజరు కావాల్సిందిగా కోరారు.

- చిన్నారుల పాలిట యమపాశం సెల్‌ఫోన్
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
- పిల్లల పెరుగుదలను కబళిస్తోన్న స్మార్ట్‌ఫోన్లు

కిల్ ఫోన్



వేటపాలెం: ఇటీవల పరిస్థితులను గమనిస్తే చిన్నారుల నుంచి మొదలుకొని పండు ముదుసలి వరకు సెల్‌ఫోన్ వాడనీ వారు లేరేమో. సంవత్సరంలోపు పిల్లలు గుక్కపట్టి ఏడిస్తే కన్నతల్లి దగ్గరకు తీసుకొని పాలు తాగించేది. భయంతో ఏడిస్తే నేనున్నానే భరోసాను నింపుతూ ఎత్తుకుని లాలించేది. గోరుముద్దలు తినిపిస్తూ జోలపుచ్చేది. కాని ప్రస్తుతం ఇవేవీ కనిపించడం లేదు. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు కనుమరుగయ్యాయి. పిల్లవాడు మారం చేస్తేచాలు సెల్‌ఫోన్ చేతిలోపెడితే ఏడుపు ఆగిపోతుంది. సెల్‌ఫోన్ మన జీవతంలో ఎంత దూరం వరకు వెళ్లిందో గమనిస్తున్నామా అనిపిస్తుంది. ప్రస్తుతం ఎవరి చేతిలో చూసినా స్మార్ట్‌ఫోన్‌లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పరిస్థితులను గమనిస్తే ఇంటిలో ఏది ఉన్నా లేక పోయినా స్మార్ట్‌ఫోన్ మాత్రం ఇంటిలో కనీస ఒక్కరికి ఉంటుంది. అదృష్టమో, దురదృష్టమో కాని స్మార్ట్ ఫోన్ నేడు మానవ జీవతంలో ఒక భాగమైంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు అందలమెక్కేసినట్లుగా భావిస్తున్నారు. జనం నాలుగో జనరేషన్ టెక్నాలజీ పుణ్యమా అని స్మార్ట్‌ఫోన్ మరింత స్మార్ట్‌గా జనానికి చేరువైపోయింది. అవసరం కోసం మొదలై సౌకర్యంగా అలవాటై చివరికి ఫోన్‌కి బానిసలుగా మారే ప్రమదకరం ఏర్పాడింది. స్మార్ట్‌ఫోన్ల విషయంలో నియంత్రణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. పేరెంట్స్ ఇద్దరు ఉద్యోగస్తులు అయిన ఇళ్లల్లో ఇలాంటి సమస్య ఎక్కువగా తలెత్తుతుంది. సెల్‌ఫోన్ వాడకంతో పిల్లల్లో మానసిక సామర్థ్యం కొరవడుతుంది. సెల్‌ఫోన్ నుంచి వచ్చే రేడియో ధార్మిక కిరణాల నుంచి చిన్నారుల బ్రెయిన్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లల్లో సృజనాత్మకశక్తి ఆలోచనాశక్తి తెలివితేటలు, మెమొరి మందగిస్తాయి. ఏకాగ్రత సన్నగిల్లుతుంది. ఆత్మ విశ్వాసం లోపించడంతో పాటుగా కోపం, మానసికి ఒత్తిడి, ఆందోళనలు పెరిగే అవకాశం ఉంటుంది. సెల్‌ఫోన్లలో వివిధ రకాలైన గేమ్స్ అందుబాటులోకి రావడంతో ఆ గేమ్స్‌లో మునిగిపోయిన పిల్లలు పక్కనున్న ఎవరినీ పట్టించుకోని స్థితిలో ఒంటరితనానికి అలవాటుపడి మానవ సంబంధాలకు దూరంగా తల్లిదండ్రుల ఆత్మీయ స్పర్శకు నోచుకోలేక పెరుగుతారు. మొదటగా ఎంతో చిన్నవిగా కనిపించే సమస్యలను సరైన సమయంలో పట్టించుకుని సరైన పరిష్కారాలు వెతకకపోతే అవే పెద్దవిగా మారి పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపై త్రీవ ప్రభావాన్ని చూపిస్తాయి. పిల్లలు ఏవైనా సమస్యలతో బాధపడుతూ, ఏడుస్తూ తమ దగ్గరకు వస్తే అవి చిన్నవే కదా అని వదిలివేయకుండా వాటిని పరిశీలించి, పరిష్కరించాలి. తల్లిదండ్రులు పని ఒత్తిడిలో ఉండి సెల్‌ఫోన్‌లోనే అన్ని సమస్యలకు పరిష్కారం ఉన్నట్లు యూట్యూబ్ గేమ్స్‌లకు పిల్లలను అలవాటు చేస్తున్నారు. ఇవి పిల్లవాడి భవిష్యత్‌ను దెబ్బతీస్తుందని గుర్తించాలి. పిల్లల కోసమే మాజీవతం అని భావిస్తున్న తల్లిదండ్రులు పిల్లల సెల్‌ఫోన్ వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే వారి భవిష్యత్‌ను చేజేతులా పాడు చేసినవారవుతారు. పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం చాల ముఖ్యం సమస్య ఎదురైనప్పుడు ముందుగా గుర్తించి దాన్ని పరిష్కారం చేయగలిగితే పిల్లల భవిష్యత్ బంగారంగా మార్చుకోచ్చు.

టీనేజర్ల ప్రవర్తనపై అధ్యయనం..

టీనేజర్ల ఆరోగ్యం, ప్రవర్తన తాలూకు అంశాలపై అమెరికాలోని శాండియాగో స్టేట్ యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ ఐజెన్ కన్సెల్టింగ్ ఫౌండర్ వైద్యురాలు జీన్ త్వెంగె టీనేజర్ల ప్రవర్తనపై అధ్యయనం చేశారు. ఆమె తన బృందంతో కలసి 13 నుంచి 18 వయస్సుగల పది లక్షలకు పైగా పిల్లపై అధ్యయనం చేశారు. టీనేజర్లు తమ సమయాన్ని ఎలా గడుతున్నారనేదే మానసిక ఆరోగ్య కోణంలో ప్రాథమిక అంశమని ఆమె పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్ యుగం పిల్లల్లో మానసిక సమస్యలు సర్వసాధారణమైపోయాయి. ఇందుకు సంబంధించిన ఓ బలమైన కేస్ స్టడీని ప్రపంచం ముందుంచారు జీన్ త్వెంగె. ఒంటరితనంతో బాధపడే టీనేజర్లు సంఖ్య బాగా పెరగడం, వారు తమ జీవితం వృథా అయిపోనట్లు భావిస్తుండం వంటి లక్షణాలు గమనించారు. ఇవన్నీ డిప్రెషన్ లక్షణాలు. ఐదేళ్లలో ఈ వ్యాధి లక్షణాలు 60 శాతం మేరకు పెరిగాయి. తమను తాము గాయపరచుకునేంతగా అవి విజృంభించాయి. బాలికల్లో ఈ ప్రమాదకర ధోరణి రెండు మూడింతలు పెరిగింది. కొన్నేళ్లలోనే టీనేజర్ల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయి. అని జీన్ తన అధ్యయన సారాంశాన్ని వివరించారు. అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ కలిసి జరిపిన అధ్యయనం ప్రకారం మన దేశంలోని కాలేజీ విద్యార్థులు రోజుకు 150 సార్లకు పైగా తమ ఫోన్లు చెక్‌చేసుకుంటున్నారు. ఫోన్ చూసుకోకపోతే ఏదో మిస్ అయిపోతామనే ఆలోచన వారిని వెంటాడుతోందని ఇదో వ్యసనంలా మారిందని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈలక్షణాలున్న వారు క్రమంగా యాంగ్జయిటీ సంబంధిత సమస్యల బారినపడే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరం



దివ్యాంగ బాలుడిని గుర్తించి తల్లితో మాట్లాడుతున్న అధికారులు

జే.పంగులూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను చదివించండి.. వారికి భవితా కేంద్రాల ద్వారా శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు విద్యాబుద్ధులు నెర్పుతారని ఎంఈవో వీరాంజనేయులు అన్నారు. సమగ్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం పంగులూరు ఎస్సీ కాలనీలో సర్వే చేసి దివ్యాంగులను గుర్తించారు. ఐదేళ్ల దివ్యాంగుడైన జే నివాస్ అనే బాలుడిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సమగ్రశిక్ష అందించే ప్రయోజనాలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎంఈవో కే వీరాంజనేయులు మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు దివ్యాంగులైన బాలబాలికలను దివ్యాంగులైన వారు ఇంటికే పరిమితం కాకుండా వారి మానసికంగా, శారీరకంగా ఎదిగేలా కృషిచేయడానికి వారిని వెదికి భవితా కేంద్రాలకు పంపిస్తామన్నారు. భవితా కేంద్రాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వివిధ రకాలైన టువంటి అలెవెన్సులు, ఉచిత ఉపకరణాలు, ఉచిత టీఎల్ఎంకిట్స్ వంటివి అందిస్తామని తెలిపారు. గత నెల రోజుల నుంచి ఇప్పటివరకు నిర్వహించిన సర్వేలో 21 మంది దివ్యాంగులను మండలంలో గుర్తించడం జరిగిందన్నారు. అంతేకాకుండా 9,10 విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారని వారికి ఇది మంచి అవకాశం అన్నారు. మండలంలోని పంగులూరులో భవితా కేంద్రం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు పి యోహాన్, టీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు దశ సహస్ర కదళీ ఫలార్చన



పదివేల అరటిపండ్ల పూజలో అంజన్న

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి శుక్రవారం అమావాస్య సందర్భంగా దశ సహస్ర (పదివేల అరటి పళ్ల) కదలీఫలార్చన చేశారు. దానిలో భాగంగా ప్రాతఃకాల అర్చన, బిందెతీర్థం, అభిషేకం, గోపూజ, ప్రత్యేక అలకంరణ చేశారు. ఉభయదాతలతో వేదస్వస్తి, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, జీవధ్వజ, ఉష్ట (ఒంటె) వాహనానికి ప్రత్యేక పూజ చేశారు. తరువాత గణపతి, సుబ్రహ్మణ్య స్వామి పూజ, 11 వరుసల్లో 10 వేల అరటి పండ్లతో పూజ చేశారు. పంచహారతులు, మహానివేదన అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు, బంధువులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ ఏసీ సుభద్ర పర్యవేక్షించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న హరిబాబు

చినగంజాం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ పర్వతరెడ్డి హరిబాబు అన్నారు. చినగంజాం శాఖ గ్రంథాలయంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు హలహరి మోహన లక్ష్మి నరసింహాచార్యులు అధ్యక్షతన ఈ శిక్షణ కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు వందేమాతర గీతంతో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, కంప్యూటర్, గీతాలు, చదవటం, రాయటం వంటి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈశిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పర్వతరెడ్డి హరిబాబు, సులోచన దంపతులు స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్షుడు ఎస్. నరసింహారావు, రిసోర్స్ పర్సన్లు శ్రీబాబు, రామాంజనేయులు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఒత్తిడి లేని విద్య



మల్లాయపాలెంలో క్యాంపెయిన్‌లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బల్లికురవ: రెండన్నర దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రిన్సిపాల్ కె. అనిల్‌కుమార్ తల్లిదండ్రులను విన్నవించారు. గురువారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కొత్తమల్లాయపాలెం, పాత మల్లాయపాలెం గ్రామాల్లో పదోతరగతి పరీక్షలు పాసైన విద్యార్థులు, తల్లిదండ్రులను ఇంటింటికి వెళ్లి కలిశారు. కళాశాలలో సాధించిన ఫలితాలను బ్రోచర్ల ద్వారా తెలియజేశారు. అనుభవనీయులైన అధ్యాపకులు పర్యవేక్షణలో వత్తిడిలేని విద్యను అందిస్తున్నామని అధునాతన వనాలు ప్రయోగశాలు, డిజిటల్ తరగతులు తక్కువ ఫీజుతో ఉచిత పాఠ్యపుస్తకాలతో సీఈసీ, ఎంపీసీ, బైపీసి తెలుగు ఇంగ్లిషు మీడియాలో విద్యాబోధన చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం



రోగిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున పరిసరాల పరిశుభ్రతతో పూర్తి ఆరోగ్యమంతులుగా జీవించవచ్చని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ. రవితేజ అన్నారు. గురువారం ఉప్పుమాగులూరు–1 సచివాలయం పరిధిలో 104 ఉచిత వైద్య శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ సోకకుండా తగు జాగ్రత్తలు వహించాలని అస్వస్థతకు గురైతే తక్షణమే పీహెచ్‌సీ వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, మృగశిర నక్షత్రం పాడ్యమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వరిగడ్డి వామి దగ్ధం



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యద్దనపూడి (పర్చూరు): మండలంలోని కొత్తపాలెంలో గురువారం ఉదయం వరిగడ్డి వామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొర్ల వెంకటేశ్వర్లకు చెందిన 10 ఎకరాల ఎండుగడ్డి వామి పూర్తిగా అగ్నికి ఆహుతైయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో చుట్టు పక్కల ప్రజలు అప్రమత్తమయ్యారు. మంటలు ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న చీరాల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. కాలిన గడ్డిని క్రేన్ సహాయంతో బయటకు తరలించారు. దగ్ధమైన వరిగడ్డి విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని భావిస్తున్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

అపురూప సంపద గ్రంథాలయం

చీరాల అర్బన్: విద్యార్థుల జీవితం ప్రగతి బాట వేసేందుకు అపురూప సంపద గ్రంథాలయం అని మండల విద్యాశాఖాధికారి పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. గురువారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభను స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. చదువు మనిషి జీవితానికి, జీవనానికి వెలుగునిస్తుందన్నారు. మనిషికి రెండు విద్యను నేర్పేది పుస్తకమేనన్నారు. జీవనోపాధిని ఎలా కల్పించుకోవాలో, రెండోది ఎలా జీవించాలో తెలుపుతుందన్నారు. విద్యార్థులలో మనోవికాసాన్ని పెంపొందిస్తూ మనోబలాన్ని కూడా అందించేవి గ్రంథాలయాలన్నారు. గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞాన జాగృతి నేస్తాలని, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు దోహదపడతాయన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో గ్రంథాలయాలు మరింతగా పురోభివృద్ధి చెందాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ఎస్.పాండురంగారావు, కె.మోహన్, ఎంవీ రవీంద్రకుమార్, గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల: మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల పరిధిలో పట్టణంలో జరుగుతున్న పనులపై విభాగాల అధికారులతో మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి గురువారం సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ, పారిశుద్ధ్య విభాగం, టౌన్ ప్లానింగ్, జనన మరణ, పింఛను, సచివాలయ విభాగాలకు సంబంధించిన పనులపై చర్చించారు. జరగబోయే పనుల వివరాలు, అంచనాలు, వీధి లైట్లు, తాగునీటి సరఫరాపై చర్చించారు. డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ బకాయిల వివరాలు, ప్లానుల ఆమోదంపై ఆయన మాట్లాడారు. జనన, మరణ విభాగంలో జనన, మరణ సర్టిఫికెట్లు నూతన వెబ్‌సైట్ నందు నమోదు చేసి త్వరగా ప్రజలకు అందించాలన్నారు. వార్డు సచివాలయాల్లో వార్డు సెక్రటరీలు ఎప్పటికప్పుడు సచివాలయాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించి ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఏసయ్య, బీ శ్యామల, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సైడ్ గ్రిల్స్‌ను ఢీకొన్న ఆటో

అద్దంకి: ఆటో అదుపుతప్పి రోడ్ సైడ్ గ్రిల్స్‌ను ఢీకొన్న ఘటనలో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈఘటన పట్టణంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని రామ్‌నగర్ వద్ద శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన కుంచాల శ్రీను, రవణ భార్యభర్తలు వారు మామిడికాయల వ్యాపారం చేసుకుని జీవిస్తుంటారు. ఈక్రమంలో వారిద్దరూ సొంత ఆటో వేసుకుని ఉలవపాడు వెళ్లి మామిడి కాయలను కొనుగోలు చేసి ఆటోలో వేసుకుని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చేరుకోగానే అదుపు తప్పి రహదారికి సైడ్‌లో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను ఢీ కొట్టింది. ఈఘటనలో ఆటోలోని రవణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో శని జయంతి



పూజలు చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: వైశాఖ మాసం అమావాస్య శని జయంతి సందర్భంగా గోచారంలో ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, శని మహర్దశ జరుగుతున్న జాతకులు గురువారం నవగ్రహాల్లో శనీశ్వరునికి తైలాభిషేకాలు, శని అష్టోత్తర పూజలు నిర్వహించారు. అమావాస్య కలిసి రావడంతో అమ్మవారి దేవాలయాల్లో అభిషేకాలు కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంటపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీ రావుపేటలో శ్రీ కనకదుర్గమ్మ వారికి, కేశవ స్వామిపేటలోని విజయ దుర్గ అమ్మవారి దేవస్థానం, లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు జరిగాయి. కేశవస్వామి పేటలో లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి, గద్దలగుంట మహాలక్ష్మి, మహా సరస్వతి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చెన్నకేశవ స్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, సమతా నగర్ కాలవ దగ్గర వెలసి ఉన్న కనకదుర్గ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానం, ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆలయ అర్చక స్వాములు అమ్మవార్ల మూలవిరాట్‌కు శ్రీ సూక్తంతో

పాలు, పెరుగు, తేనె, చక్కెర, పండ్ల రసాలతో అభిషేకించి, వివిధ రకాల పూలతో చక్కగా పుష్పాలంకరణ గావించారు. చక్రానికి దేవి ఖడ్గమాలతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం పాలకవర్గం స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాల ముగింపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: గతకొన్ని రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ శిబిరాలు ముగిశాయి. సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో గురువారం 20వ రోజు విజ్ఞాన శిబిరాలు ముగింపు కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని, విద్యార్థులకు వారి ప్రతిభ ఆధారంగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు.